ప్రజాశక్తి
శుక్రవారం 2 మే 2025 5 విజయనగరం



డిఇఇ సెట్‌కు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిఇడి కోర్సులో చేరేందుకు రీజినల్ జాయింట్ డైరెక్టర్ అఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిఇఒ యు.మాణిక్యం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 2,3 తేదీల్లో జరుగున్న డిఇడి టెస్ట్‌కు ఈనెల 8వరకు https://cse.ap.gov.in, https://apdeect.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

మేడే స్ఫూర్తితో కార్మిక చట్టాలను కాపాడుకుందాం

ఎస్.కోటలో అరుణ పతాకాన్ని ఎగురవేస్తున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని

- మేడే వేడుకల్లో కార్మిక సంఘాల నాయకులు
- 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపు

విజయనగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

మేడే స్ఫూర్తితో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను కాపాడుకోవాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. దేశంలో మతోన్మాదం, ఉగ్రవాదం, శ్రమదోపిడీని అరికట్టేందుకు పోరాటాలే మార్గమని అన్నారు. మేడే సందర్భంగా గురువారం జిల్లా వ్యాప్తంగా వాడవాడలా మేడే జెండాలను కార్మిక సంఘాల నాయకులు ఎగురవేశారు. రాజాంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్,, బొబ్బిలిలో జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు, ఎస్.కోట, వేపాడలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, విజయనగరంలో రెడ్డి శంకర్రావు, నెల్లిమర్లలో రాష్ట్ర కమిటీ సభ్యులు టివి రమణ, బొబ్బిలిలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు మేడే జెండాలను ఎగురవేశారు.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, శృంగవరపుకోట

దేశంలో బిజెపి గద్దెనెక్కాక కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్మిక వ్యతిరేక విధానాలపై, కార్మిక హక్కులను పరిరక్షించుకునేందుకు మేడే స్ఫూర్తితో పోరాటం సాగించాలని ఆయన పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా శృంగవరపుకోట పట్టణంలో సామాజిక ఆస్పత్రి ఎదుట ఎర్రజెండాను తమ్మినేని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాల రాయాలని చూస్తోందని, అందులో భాగంగానే 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో కార్మికులు సర్వహక్కులనూ కోల్పోతారని ఆందోళన వ్యక్తంచేశారు. కార్పొరేట్లకు కార్మిక వర్గాన్ని బానిసలుగా చేయాలని మోడీ ఆలోచిస్తున్నారని మండిపడ్డారు. దీన్ని వామపక్షాలు, డిఎంకె మాత్రమే వ్యతిరేకించాయని గుర్తుచేశారు. స్కీమ్‌వర్కర్లను రెగ్యులర్ చేయాలని, కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని ఈ నెల 20న చేపట్టే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆస్పత్రి నుంచి పట్టణంలోని దేవి కూడలి వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు, ఆశాలు, ఎండిఎం నిర్వాహకులు, క్వారీ, మోటార్ యూనియన్ కార్మికులు, పంచాయతీ కార్మికులు, గ్రామ సేవకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి కార్యాలయం వద్ద సిఐటియు జెండాను తమ్మినేని సూర్యనారాయణ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులు అనేక పోరాటాలు చేసి కార్మిక హక్కులు, సమ్మె హక్కు, కార్మిక చట్టాలను సాధించుకున్నారని తెలిపారు. కానీ నేడు కేంద్రంలో మోడీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను 4 కోడ్ లుగా విభజించి కార్మిక హక్కులు, సమ్మె చేసే హక్కు లేకుండా చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. ఇటువంటి నేపథ్యంలో పోరాడి సాధించుకున్న చట్టాలను,హక్కులను,సమ్మె హక్కును కాపాడుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందని అన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రజాశక్తి జిల్లా మేనేజర్ రాము, స్టాఫ్ రిపోర్టర్ రమేష్ నాయుడు, డెస్క్‌ఇన్‌ఛార్జి పి.అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ కార్మిక పోరాటం దినోత్సవం మేడే స్ఫూర్తితో కార్మికుల హక్కుల రక్షణకు, దోపిడీ విముక్తి కోసం, సమ సమాజ సాధన కోసం పోరాడాలని సిఐటియు నాయకులు రెడ్డి శంకరరావు పిలుపునిచ్చారు .మేడే సందర్భంగా దాబా తోటలో సిఐటియు జెండాను ఆవిష్కరించారు. అనంతరం డాబాతోట నుంచి కన్యకాపరమేశ్వరి జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 గంటల పనిదినం కోసం జరిగిన పోరాటంలో చిందిన కార్మికుల రక్తంతో వెలసిన ఎర్ర జెండా నాయకత్వంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఉద్యమిస్తామన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం, విజయనగరంజిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వంపై పోరాడాలని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డు సక్రమంగా నిర్వహించాలని, ఆటో కార్మికులు, కళాసీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. నగరంలో ఎపి బేవరేజీస్, డాబాతోట వద్ద సిఐటియు అరుణ పతాకాన్ని ఎగురవేశారు. జిల్లా కేంద్రాస్పత్రి ఆటో స్టాండ్ వద్ద సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ, జిసిసి వద్ద నగర అధ్యక్షులు ఎ. జగన్మోహన్ పతాకాన్ని ఎగురవేశారు.

-మే డే సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యాలయంయ వద్ద యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు డి.రాము పతాకావిష్కరణ చేశారు. మేడే స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై పోరాడుతామని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె. శ్రీనివాసరావు, జెవివిఆర్‌కె ఈశ్వర రావు, నాయకులు రమేష్ చంద్ర పట్నా యక్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి

నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మేడే జెండాను సీనియర్ కార్మికుడు కోడూరు రామచంద్రరావు ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎ. జగన్మోహన్రావు, బి. భాస్కరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం పర్మినెంట్ చేస్తామని ఆప్కాస్ లో చేర్చడం వల్ల వారసత్వంగా వస్తున్న పని హక్కును కోల్పోయామని అన్నారు. కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు ఆదినారాయణ, కష్ణ, రజిని, అశోకు, సూరి, మోహన్, తిరుమల రావు తదితరులు పాల్గొన్నారు.

ఎఐఎఫ్‌టియు ఆధ్వర్యాన

(ఎఐ ఎఫ్ టి యు న్యూ) ఆధ్వర్యంలో ఊట గడ్డ చాకిరేవుల వద్ద అసంఘటిత రంగ కార్మిక హక్కుల సాధన కన్వీనర్ బి.గిరి ప్రసాద్ అధ్యక్షతన సభ జరిగింది. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.శంకర్రావు మాట్లాడుతూ పాలకుల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మేడే స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. విజయానగరం షాప్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం అప్పలరాజు, అసంఘటిత కార్మిక హక్కుల సాధన సమితి కన్వీనర్ బి. గిరి ప్రసాదు, జిల్లా రజక సమాఖ్య అధ్యక్షులు జి.సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపాన మేడే జెండా ఆవిష్కరించారు. అనంతరం చెన్నా ధర్మారావు అధ్యక్షతన జరిగిన సభలో ఎఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రెడ్డి నారాయణరావు, యూనియన్ అధ్యక్షులు నీలాపు అప్పలరాజు రెడ్డి మాట్లాడారు.

రాజాం.. మేడే వేడుకల్లో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్

లేబర్ కోడ్‌లతో కార్మిక హక్కులకు ముప్పు

సినీనటుడు నారాయణమూర్తి



ప్రజాశక్తి-బొబ్బిలి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లతో కార్మిక హక్కులకు, చట్టాలకు ముప్పు వాటిల్లనుందని సినీనటుడు ఆర్.నారాయణమూర్తి అన్నారు. మే డే సందర్భంగా గురువారం స్థానిక తాండ్రపాపారాయ విగ్రహం జంక్షన్లో పట్టణ కళాసీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాదించుకున్న కార్మిక చట్టాలను మార్చివేసి లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని అన్నారు. ఈ లేబర్ కోడ్ చట్టాలకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విప్లవ గీతాలు పాడి యువతను ఉర్రూతలూగించారు. ఎఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు బి.శంకరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను మార్చివేసి కార్మికుల శ్రమ దోపిడీకి లైసెన్స్ ఇస్తున్నాయని విమర్శించారు. జిల్లాలో జ్యూట్ పరిశ్రమలను మూసివేసి ఆయా స్థలాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మివేయడం దుర్మార్గమన్నారు. చక్కెర పరిశ్రమలను మూసి వేసి విదేశాల నుంచి చక్కెరను దిగుమతి చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పట్టణ కళాసీ సంఘం అధ్యక్ష,కార్యదర్శులు బి.అప్పలస్వామి, డి.వర్మ, సభ్యులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఉన్న పరిశ్రమలశాఖ జిల్లా కార్యాలయం

కార్యాలయానికే టికానా లేదు.. పరిశ్రమలెలా వస్తాయో?

అమ్మకు తిండిపెట్టనివాడు.. పిన్నమ్మకి బంగారు గాజులు కొనిపెడతానన్నాడట వెనుకటి ఓ వ్యక్తి. అచ్చంగా ఈ సామెత పరిశ్రమల శాఖ విషయంలో ప్రభుత్వానికి అతుక్కుపోతుంది. పరిశ్రమల శాఖలో కీలకమైన జనరల్ మేనేజర్ పోస్టే ఖాళీగా ఉండడం మొదలుకుని, కార్యాలయంలో అడుగడుగునా వేధిస్తున్న అసౌకర్యాలే ఇందుకు తార్కాణంగా చెప్పకోవచ్చు.

అసౌకర్యాల మధ్య పరిశ్రమల శాఖ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన జిల్లా. ఇందులోనూ వ్యవసాయ, సేవారంగాలతో పోలిస్తే పారిశ్రామిక రంగం మరీ దారుణంగా ఉంది. కొత్త పరిశ్రమలు లేవు. గడిచిన రెండు దశాబ్దాల్లో జ్యూట్, ఫెర్రో ఎల్లాయిస్, చక్కెర పరిశ్రమలు మూతపడ్డాయి. తాజాగా జిందాల్ పరిశ్రమ అక్రమ లాకౌట్‌తో మూతపడింది. గరివిడి ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ క్రమంగా ఉత్పత్తులను తగించుకోవడంతో ఒకప్పుడు వేలాది మంది కార్మికులతో కళకళలాడే ఫేకర్ నేడు బోసిపోయినట్టుగా కనిపిస్తోంది. ప్రభుత్వ విధానాల కారణంగా మరికొన్ని ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు మూసివేత దిశగా అడుగులు వేస్తున్నాయి. మరోపక్క కొత్త పరిశ్రమల జాడ కనుచూపుమేరలో కనింపించడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో చిన్నచితక పరిశ్రమలు జిల్లాలో ఏర్పాటు కావాలన్నా, ఉన్న పరిశ్రమలు సవ్యంగా మనుగడ సాగించాలన్నా పరిశ్రమల శాఖ కార్యాలయం అత్యంత కీలకం. నేటి ఆధునిక సమాజంలోనూ, కార్పొరేట్ ప్రపంచంలోనూ అడ్మినిస్ట్రేషన్, అందుకు కేంద్రంగా ఉండే కార్యాలయం అత్యంత సౌకర్య వంతంగాను, ఆకర్షణీ యంగాను ఉండాల న్నది వేరేగా చెప్పనక్కర్లేదు.

ఇంతటి ప్రాధాన్యతగల కార్యా లయానికి తగిన భవనం కూడా లేదంటే అతిశయోక్తి కాదు. ఈ శాఖకు విటి అగ్రహారంలోని సుమారు 50ఏళ్ల క్రితం నిర్మించిన పురాతన భవనంలోని చిన్నపాటి గది కేటాయిం చారు. ఉన్న కొద్దిపాటి సిబ్బంది విశాలంగా కూర్చోవడానికి కూడా సరిపోని పరిస్థితి. ఇక జిఎం పోస్టు చాలా కాలంగా ఖాళీగా ఉంది. ఛాంబర్ కూడా అత్యంత ఇరుకుగా, ఊడిపోయిన తలుపులతో ఉంది. కంప్యూటర్లు సరిగా పనిచేయడం లేదు. నెట్ బిల్లులు అంతతమాత్రంగా ఉండడంతో నెట్ వర్కు ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. కనీసం ఒక్క అటెండర్ కూడా లేదు. స్టేషనరీ ఖర్చులకు డబ్బులు రావడం లేదట. జనరల్ మేనేజరే లేనప్పుడు ఆయనకు ఇంకా కారెందుకు అనుకున్నారో ఏమో ఆ సదుపాయం కూడా లేదు. ఇటువంటి పరిస్థితుల్లో పరిశ్రమల శాఖ కార్యాలయం నడుస్తుంటే.... జిల్లాను పారిశ్రామిక రంగంలో ముందుకు నడిపిస్తామని, అందుకోసం వందలాది ఎకరాల భూములు సేకరిస్తున్నామని జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు కథలు, కథలుగా చెప్పుకురావడం పట్ల జిల్లా ప్రజానీకం, ముఖ్యంగా పరిశ్రమల శాఖకు వచ్చిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు నివ్వెరపోతున్నారు. పరిశ్రమల శాఖను నడిపే జనరల్ మేనేజర్, సిబ్బందికి సదుపాయాలే కల్పించలేకపోతే, తమకు ఎలా న్యాయం చేస్తారని ప్రశ్నిస్తున్నారు.

25 శాతం సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

విజయనగరం టౌన్ : పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించాలనే లక్ష్యంతో కార్పొరేట్ పాఠశాలలో 25 శాతం సీట్ల కేటాయింపునకు ఈ నెల 2 నుండి 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్ష ఎపిసి ఎ.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న లాటరీ పద్ధతి ద్వారా సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. జూన్ 8న ప్రవేశాలు ఉంటాయని, తిరిగి 11న రెండోసారి లాటరీ ప్రక్రియ ఉంటుందని తెలిపారు. ఆధార్ కార్డ్, ఓటరుగుర్తింపు కార్డు, తెల్ల రేషన్ కార్డు, పాస్ ఫోటో, భూ హక్కుపత్రం, ఉపాధి హామీ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఇంటి అద్దె ఒప్పందం కాపీ, విద్యుత్ బిల్లు ఉండాలని తెలిపారు. తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ 1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ1.44 లక్షలు మించరాదని తెలిపారు. సిబిఎస్ఇ పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు 2019 ఏప్రిల్ 2 నుండి 31 మార్చి 2020 మధ్య జన్మించి ఉండాలని, స్టేట్ సిలబస్ పాఠశాలలకు 2 జూన్ 2019 నుండి 31 మే 2020 మధ్య జన్మించాలని తెలిపారు. www.cse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయవచ్చునని పేర్కొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి జైలు

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

విజయనగరం పట్టణం మహిళా పోలీసు స్టేషనులో 2022 సంవత్సరంలో నమోదైన అత్యాచారం, నమ్మించి మోసగించిన కేసులో నిందితుడైన రాజాం మండలం పొగిరి గ్రామానికి చెందిన టంకాల శంకరరావుకు విజయనగరం 5వ ఎడిజె కోర్టు జడ్జి ఎస్.పద్మావతి గారు ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెల్లడించారు. రాజాం మండలం పొగిరి గ్రామానికి చెందిన నిందితుడు టంకాల శంకరరావు అదే గ్రామానికి చెందిన ఒక ఆమెను ప్రేమిస్తున్నానని, పెళ్ళి చేసుకుంటానని నమ్మించి మోసం చేసి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. పెళ్లికి నిరాకరించడంతో విజయనగరం మహిళా పోలీసు స్టేషన్లో 2022లో బాధితరాలు ఫిర్యాదు చేసింది. నేరం రుజువు కావడంతో ఏడాది శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

కార్మికులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-విజయనగరంలీగల్

ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మరియు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న బి హెచ్ వి లక్ష్మీ కుమారి గురువారం అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా పబ్లిక్ ట్రాన్సుపోర్టు డిపార్టుమెంట్ డిపోలో పనిచేస్తున్న కార్మికులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మిక చట్టాలు, వేతన సవరణ, హక్కులు, బాధ్యతలు గురించి వివరించారు. కార్మికులు పనిచేస్తున్న చోట ఆరోగ్యవంతమైన పరిసరాలు ఉన్నాయా లేవా పరిసరాలు పరిశుభ్రమైన వాతావరణంలో కార్మికులు పనిచేస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. వారికి ఉండవలసిన కనీస సౌకర్యాలు యాజమాన్యం కల్పిస్తున్నదా లేదా అని చర్చించారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయం గురించి వారికి తెలియజేశారు. కార్మికులకు ఏ విధమైన న్యాయ అవసరాలు ఉన్నా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించవచ్చును లేదా జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 15100 కి ఫోన్ చేసి న్యాయ సలహాలను పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ కె.సూర్యప్రకాష్, డిపో మేనేజర్ జె.శ్రీనివాస్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ నామినేటెడ్ సభ్యులు జి.లలిత, జి.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీకుమారి

పలు ప్రాంతాల్లో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య గురువారం పలు ప్రాంతాల్లో పర్యటించి, పారిశుధ్య ప్రక్రియను పరిశీలించారు. అలాగే ఎన్టీఆర్ భరోసా కింద సిబ్బంది పంపిణీ చేస్తున్న పింఛను ప్రక్రియను గమనించారు. శతశాతం పింఛన్ పంపిణీ లక్ష్యంగా కషి చేయాలని కార్యదర్శులకు సూచించారు. గురజాడ కళాక్షేత్రం, పాలాస్పత్రి, మూడులాంతర్ల జంక్షన్, గాంధీ పార్క్ ప్రాంతాలను పరిశీలించారు. గురజాడ కళాక్షేత్రంలో జిఎ షెడ్ నిర్మించేందుకు, విద్యుత్ దీపాలు అమర్చేందుకు, చదువుకునే విద్యార్థులకు సౌకర్యవంతమైన బెంచీలు, కుర్చీలు ఏర్పాటు చేసి, పాక్షిక మరమ్మత్తులను చేపట్టేందుకు అంచనాలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. పాలాస్పత్రి ఔన్నత్యానికి విఘాతం కలగకుండా అవసరమైన మరమత్తు పనులు చేపట్టి అందంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. అనంతరం మూడులాంతర్ల జంక్షన్‌ను పరిశీలించి, పాక్షిక మరమ్మతులు చేపట్టి మరింత ఆకర్షణయంగా రూపుదిద్దే విధంగా చేపట్టాలన్నారు. గాంధీ పార్కు వద్ద అక్కడ మరుగుదొడ్ల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, పనులు తక్షణమే ప్రారంభించేలా చొరవ చూపాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు.

పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విలువిద్య క్రీడా పోటీలను తిలకిస్తున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్, క్రీడా సంఘాల ప్రతినిధులు

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో తలపెట్టిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు విజ్జీ స్టేడియంలో గురువారం ప్రారంభించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, బాక్సింగ్, హ్యాండ్బాల్, తైక్వాండో, ఫుట్‌బాల్ క్రీడా శిక్షణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్దులు క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలన్నారు. ప్రభుత్వం విద్యార్థి దశ నుంచే క్రీడలను ప్రోత్సహించేందుకు వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహిస్తుందన్నారు. బాగా నేర్చుకొని మంచి క్రీడాకారులకా ఎదగాలన్నారు. డిఎస్‌డిఒ ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేంఉదకు, విద్యార్థుల్లో ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించేందుకు ఈ శిబిరాలను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, శిక్షకులు, వివిధ క్రీడా సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనధికార మందుగుండు తయారీపై తనిఖీలు

కేసులు నమోదు చేయాలని ఎస్‌పి ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం కోట

అనధికారంగా మందుగుండు తయారీ, నిల్వలు, విక్రయాలు నిర్వహించే వారిపై దాడులు విస్తతం చేసి, వారిపై కేసులు నమోదు చేయాలన్న జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలో లైసెన్సులు కలిగి మందుగుండు సామగ్రి నిల్వలు, విక్రయాలు జరిపే గోడౌన్లు, షాపుల్లో భద్రత ప్రమాణాలు, నిబంధనలు పాటిస్తున్నది, రక్షణ చర్యలు చేపడుతున్నది లేనిది పరిశీలించి, నివేదికలను అందజేయాలని సూచించారు. సంబంధిత అధికారులు జారీ చేసిన లైసెన్సులను, రికార్డులను పరిశీలించాలన్నారు. లైసెన్సులు కలిగిన షాపులు, గోడౌన్లను సంబంధిత పోలీసు అధికారులు సందర్శించి, సంబంధిత గోడౌన్లు, షాపుల్లో భద్రత ప్రమాణాలు, నిబంధనలు పాటించే విధంగా చూడాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా షాపుల యజమానులు చేపట్టిన రక్షణ చర్యలను పరిశీలించాలన్నారు. మందుగుండు నిల్వ చేసే గోడౌన్లు, షాపుల్లో స్మోకింగు అలారమ్ ఏర్పాటు చేసుకోవాలని, అగ్ని ప్రమాదాల నుండి సురక్షితంగా బయట పడేందుకు కనీసం రెండు అత్యవసర మార్గాలు ఉండే విధంగా చూడాలన్నారు. గ్రామ స్థాయిలో సమాచార వ్యవస్థలను ఏర్పాటు చేసుకొని, సమాచారం సేకరించి, మందు గుండును అనధికార విక్రయాలు, తయారీ, నిల్వలు జరిపే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ఈ నేపథ్యంలో పోలీసు అధికారులు గురువారం పలు ప్రాంతాల్లో మందుగుండు సామాగ్రి తయారీ కేంద్రాలు, గోడౌన్‌లను తనిఖీ చేశారు.

గోడౌన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

విద్యాభివృద్ధికి పివిజి రాజు కృషి ఎనలేనిది

శత జయంతి ఉత్సవాల ముగింపులో అశోక్ గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరం

విద్యాభివృద్ధికి రాజసాహెబ్ డాక్టర్ పివిజి రాజు చేసిన కృషి ఎనలేనిదని పలువురు కొనియాడారు. గత ఏడాది మే 1వ తేదీ నుండి ప్రారంభమైన పివిజి రాజు శతజయంతి ఉత్సవాలు ముగింపు వేడుకలు గురువారం మాన్సాస్ సంస్థలో ఘనంగా జరిగాయి. మాన్సాస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ కెవిఎల్ రాజు అధ్యక్షత వహించిన ఈ వేడుకలలో మాన్సాస్ ఛైర్మన్, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు, ఆర్ వి సునీత ప్రసాద్, చంద్రమౌళి, ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ నైతికవిలువలు, మంచి గుణంతో కూడిన విద్య నేటి సమాజ అభివృద్ధికి ఎంతగానో దోహపడుతుందని అన్నారు. అప్పట్లో అక్షరాస్యత కేవలం 7 శాతం మాత్రం ఉండేదని, సామాన్య ప్రజలకు కూడా ఉచిత విద్య అందిచడానికి డాక్టర్ పి వి జి రాజు ఎంతో కృషి చేశారని అన్నారు. గుణాత్మక విద్యను అందించడానికి బి.ఈడి కళాశాలను కూడా స్థాపించారని చెప్పారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా విద్యార్థులకు 5 లక్షల ఉపకారవేతనాలను అందజేశారు. జూలై 17న డాక్టర్ పూసపాటి ఆనంద గజపతిరాజు జయంతి సందర్భంగా విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల్లోని 100 మంది విద్యార్థులకు ఐదు లక్షల ఉపకావేతనాలను అందజేస్తామని చెప్పారు. ఉచిత నేత్ర వైద్య శిబిరం, ఉచిత పశు వైద్య శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ, న్యాయ అవగాహనా సదస్సులు వంటివి ద్వారపూడి, జొన్నవలస, రాకోడు, కోరుకొండపాలెం గ్రామాలలో నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ పి.ఎస్. సీతారామరాజు, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్ మాన్సాస్ విద్యాసంస్థ, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపకార వేతనాలను అందజేస్తున్న మాన్సాస్ ఛైర్మన్ అశోక్ గజపతిరాజు

ఘనంగా మేడే వేడుకలు

బొబ్బిలి : జెండా ఎగురవేస్తున్న బి.అప్పలస్వామి

ప్రజాశక్తి-విలేకర్ల బృందం

జిల్లా వ్యాప్తంగా మేడే వేడుకలు వాడవాడలా ఘనంగా జరిగాయి. కార్మిక సంఘాల ఆధ్వర్యాన కార్మికులు ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రజెండాను ఎగురవేశారు. లేబర్‌కోడ్‌లకు, మతోన్మాదానికి వ్యతిరేకంగా, హక్కులు, చట్టాలు అమలు కోసం పోరాడుతామని ప్రతిజ్ఞలు చేశారు.

రాజాం : పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ ఆధ్వర్యంలో రిక్షా వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకులు రాములు జెండాను ఆవిష్కరించారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి మున్సిపాల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ మున్సిపల్ యూనియన్ నాయకులు లక్ష్మీ జెండాను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ మే 20న దేశవ్యాప్త సమ్మెకు సిద్ధమవ్వాలన్నారు. యూనియన్ ఉన్నా లేకున్నా లేబర్ అనేవాడు బిజెపి దుర్మార్గాలను అడ్డుకోకపోతే కార్మికుల భవిష్యత్ అంధకారమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.త్రినాథ్, రైస్‌మిల్లు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కంచినాయుడు, కార్యదర్శి శ్రీనివాసరావు, డ్రైవర్స్ యూనియన్ నాయకులు అప్పలకొండ, రమణ, మున్సిపల్ యూనియన్ నాయకులు శ్రీను, రవి, రాజేష్, మధ్యాహ్నం భోజన పథకం యూనియన్ నాయకులు హైమావతి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు అర్జున్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఆర్.మోహన్‌రావు, జిల్లా కార్యదర్శి వాసు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో పార్లమెంట్ ఐటిడిపి నాయకులు జరజాన నితిన్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికులు, మెకానిక్ తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో: యుటిఎఫ్ రాజాం డివిజన్ ఆధ్వర్యంలో యుటిఎఫ్ పతాకాన్ని సీనియర్ నాయకులు ద్వారపు రెడ్డి భాస్కరరావు ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు, జిల్లా కార్యదర్శి పక్కి వాసు, బోనెల గౌరీశ్వరరావు, రాజాం, సంతకవిటి, రేగిడి, వంగర మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: కార్మిక హక్కులు పోరాటాలతోనే సాధ్యమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ అన్నారు. మేడే సందర్భంగా సంకిలి ఇఐడి షుగర్ ఫ్యాక్టరీ, ఉంగరాడ మెట్ట వద్ద యూనియన్ అధ్యక్షులు శ్రీధర్ అధ్యక్షతన, షుగర్ సీనియర్ ఉద్యోగి నక్క రమణ సిఐటియు జెండా ఆవిష్కరణ చేశారు. సిఐటియు నాయకులు ఎం.త్రినాథ్, విశ్వనాథం, యూనియన్ జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ, ట్రెజరర్ శ్రీనివాసరావు, సురేష్, విఆర్‌సి నాయుడు, రాంబాబు, గోవింద్, డి.రవిశంకర్, వి.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తిగా ఐక్యంగా పోరాడి లేబర్ కోడ్లు తిప్పి కొట్టాలి

నెల్లిమర్ల: మేడే స్ఫూర్తితో నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాడాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.వి.రమణ పిలుపునిచ్చారు. నగర పంచాయతీ కార్యాలయం వద్ద సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టివి రమణ, జిల్లా విద్యుత్ స్టోర్స్ వద్ద సిఐటియు జిల్లా కమిటి సభ్యులు కిల్లంపల్లి రామారావు, మొయిద జంక్షన్‌లో మెడికల్, హెల్త్ రంగం నుంచి ఎ.మాదవి, జ్యూట్ మిల్ గేటు వద్ద, జరజాపుపేటలో రిటైర్డ్ జ్యూట్ కార్మికులు జగ్గిన్ని సత్యారావు, కొండల కరువులు మే డే పతకాన్ని ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ హమాలీ సంఘం నాయకులు పతివాడ లక్ష్మణరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు చిట్టి తల్లి, మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు బాబురావు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎపి బేవరేజీస్ వద్ద సిఐటియు నాయకులు రెడ్డి శంకరరావు సిఐటియు అరుణ పతాకాన్ని ఆయన ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేస్త్రి బమ్మిడి గోవిందరావు, ఎపి బేవరేజెస్ నాయకులు పి.శ్రీనివాసరావు, బి.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, పట్టణ కళాసీ సంఘం కార్యాలయం వద్ద అధ్యక్షులు బి.అప్పలస్వామి, జెండా మహల్ జంక్షన్ వద్ద ఎఐటియుసి జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎం.శ్రీనివాస్, ఆరిగంగయ్య మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద స్కీమ్ వర్కర్స్ ఎర్ర జెండాలను ఎగుర వేశారు. బొబ్బిలిలో గాంధీ విగ్రహం వద్ద పతాకాన్ని రాష్ట్ర నాయకులు విజయగౌరి ఆవిష్కరించారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, నాయకులు మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం : మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంకు సెంటర్, ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద మేడే వేడుకలను నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు నర్సింగరావు, పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు బి.కనకరాజు, రిక్షా కార్మిక సంఘం నాయకులు సూర్యనారాయణ ఎర్ర జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎపి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కోచైర్మన్ బి.కాంతారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాస్, బి.కృష్ణ, కోటి అప్పలరాజు, కృష్ణ, గోవింద్ పాల్గొన్నారు.

దత్తిరాజేరు : కోమటిపల్లి ఆటో స్టాండ్ వద్ద ఆటో యూనియన్ అధ్యక్షులు దాలినాయుడు, మానాపురం సంతతోట వద్ద హైవే ఆటో స్టాండ్ నాయకులు గోవింద్ జెండావిష్కరణ చేశారు. అనంతరం కోమటిపల్లి ఆటో స్టాండ్ నుండి సంతవరకు ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి. లక్ష్మి, ఆటో యూనియన్ కార్యదర్శి బి.అప్పలనాయుడు, ఈశ్వరరావు, కె.ఉమా మహేశ్వరరావు, అంగన్వాడీ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు పి.జ్యోతి, పద్మకళ, దమయంతి, లక్ష్మణరావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : మండలంలో బొడ్డవర, శృంగవరపుకోట ఆటో స్టాండ్ల వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నాయకులు మేడే జెండాను ఆవిష్కరించారు. పట్టణంలోని పంచాయతీ కార్యాలయం ఎదుట సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మేడే జెండాను ఆవిష్కరించారు. శ్రీ విజయదుర్గ యూనియన్ జెసిబి, హైడ్రా, ట్రాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మేడేను నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు మోపాడ సిద్దు, ఉపాధ్యక్షులు కె.సన్నిబాబు, కార్యదర్శి మజ్జి గంగరాజు, ట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వాకాడ బాలు, జెసిబి అండ్ హైడ్రా ప్రెసిడెంట్ గేదెల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : మండల కేంద్రంలో సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీనివాసరావు ఎర్ర జెండా ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు.

మెంటాడ : మండల కేంద్రంలో ఎర్ర జెండాను కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు ఎగురవేశారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు కోడూరు అప్పలనాయుడు, రైతు సంఘం నాయకులు వాక దేవుడు, సిరిశెట్టి మంగమ్మ, గాడి రవణమ్మ, రెడ్డి దేవి పాల్గొన్నారు.

గంట్యాడ : మండలంలో కొండ తామరపల్లి, కొటారుబిల్లి, బుడతనాపల్లి కూడళ్లలో ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అనసూయ, సిఐటియు మండల నాయకులు కె.రవికుమార్ జెండా ఆవిష్కరణ చేశారు. శ్రీకనకదుర్గ ఆటో యూనియన్ అధ్యక్షులు డి.దేముడు, ఉపాధ్యక్షులు పి.నాయుడు, శ్రీ ఎల్లమాంబ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మామిడి రాజు, ఉపాధ్యక్షులు రఘుమండి ఈశ్వరరావు, కొండతామరపల్లి జంక్షన్ ఆటో యూనియన్ నాయకులు వెంకట్రావు, అంగన్వాడీలు పాల్గొన్నారు

కొత్తవలస : కొత్తవలస జంక్షన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాడి అప్పారావు ఆధ్వర్యంలో మేడే జెండా ఎగుర వేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. జిందాల్ పరిశ్రమ వద్ద టిఎన్‌టియుసి నాయకులు పిల్ల అప్పలరాజు, నమ్మి చినబాబు జెండా ఎగరవేశారు. కార్యక్రమంలో ఎన్‌జిఒ అసోసియేషన్ తాలూకా ప్రెసిడెంట్ ప్రసాదరావు, జిల్లా నాయకులు గొంప కృష్ణమూర్తి, ఎల్.సత్యారావు, బి.శ్రీనివాస్, శేషుబాబు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు కె.తులసి, తదితరులు పాల్గొన్నారు.

జామి : మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద సిఐటియు జిల్లా నాయకులు జి.అప్పలసూరి ఆధ్వర్యాన మేడేను నిర్వహించారు. అనంతరం ఎస్ఐ వీరజనార్ధన్ చేతుల మీదుగా మజ్జిగ పంపిణీ చేపట్టారు. జంక్షన్లో ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సత్యం కృష్ణ, ఉపాధ్యక్షులు ఆర్‌ఆర్ పైడ్రాజు సంయుక్తంగా జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో కె.సత్తిబాబు, గొర్లి ద్వర, డోల కిషోర్, చలుమూరి ఎర్ని వెంకట్రావు, వియ్యపు సంతోష్ పాల్గొన్నారు.

వేపాడ : మండలంలో సిఐటియు నాయకులు చల్లా జగన్ ఆధ్వర్యాన మేడే వేడుకలు నిర్వహించారు. వేపాడలో ఎస్ఐ సుదర్శన్, సోంపురం క్వారీలో యూనియన్ నాయకులు బుద్ధ గోవింద, బొద్దాం ఆటోస్టాండ్‌లో చలుమూరి శ్యామ్ ఎర్రజెండాను ఆవిష్కరించారు. బొద్దాంలో ఆటో కార్మికులు ర్యాలీ చేపట్టారు.

వంగర : మండల కేంద్రంలో సిఐటియు సభ్యులు ద్రు రాంబాబు జెండా ఆవిష్కరణ చేశారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రూపవతి, జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు యం.గణపతి, సిఐటియు నాయకులు అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: నాతవలస టోల్ గేటు వద్ద కార్మికులు సిఐటియు యూనియన్ నాయకులు జెండాను ఎగురవేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బి. సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమలో టోల్‌గేటు యూనియన్ అధ్యక్షులు చింతపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఎన్ని ఆదినారాయణ, వి కృష్ణ, ఏ.నరేష్ తదితరులు పాల్గొన్నారు. డెంకాడ పిహెచ్‌సి వద్ద సిఐటియు మండల కార్యదర్శి ఎన్. సూర్యనారాయణ జెండా ఎగురవేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు ఆదిలక్ష్మి,కుమారి, ఎన్‌జిఒనాయకులు ఎం.దుర్గారావు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: జి.చోడవరం మైలాన్ పరిశ్రమవద్ద కార్మికులు జెండాను ఎగురవేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బి. సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు జి పుల్లయ్య, జి ఆదినారాయణ, గోపి, త్రినాధ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం. రామకృష్ణ, ఆర్.లక్ష్మణ్‌మూర్తి,పాల్గొన్నారు.

గుర్ల : తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు బొత్స సుధారాణి జెండా ఎగుర వేశారు. సిఐటియు నాయకులు నారాయణరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చీపురుపల్లి : మండలంలోని కర్లాం వెంకట్రామ పౌల్ట్రీ వద్ద సిఐటి నాయకులు అంబల్ల గౌరినాయుడు మేడే పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో స్థానిక సిఐటి నాయకులు ఇప్పుడు నాయుడు పౌల్ట్రీ కార్మికులు పాల్గొన్నారు.

గరివిడి : మైన్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన మైన్స్ కార్మికులు జెండా ఎగురవేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి పిసిని అప్పలనాయుడు, పాపినాయుడు, శనపతి రమణ, పాపినాయుడు, కరణం సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు. సిఐటియు కార్యాలయం వద్ద, పామాయిల్ వర్కర్స్ యూనియన్ డిఎఫ్ఎన్ వద్ద ఆ యూనియన్ నాయకులు అంబళ్ల గౌరినాయుడు జెండా ఎగుర వేశారు. జెండా ఎగురవేశారు.

బాడంగి : సిఐటియు నాయకులు సురేష్ ఆధ్వర్యాన జరిగిన వేడుకల్లో అంగన్వాడీ యూనియన్ నాయకులు రమణమ్మ జెండాను ఎగుర వేశారు.

మెరకముడిదాం : తహశీల్దార్ కార్యాలయం వద్ద జెండా ఎగుర వేశారు. ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు మజ్జి గౌరి జెండా ఎగురవేశారు. ఆశావర్కర్లు, విఆర్ఎలు పాల్గొన్నారు.

సంతకవిటి: మేడే స్ఫూర్తితో పోరాట వారసత్వం కొనసాగించాలని సిఐటియు మండల అధ్యక్షులు కె.అసిరప్పడు అన్నారు. మండల కేంద్రంలోని సిఐటియు జెండాను ఆయన ఆవిష్కరిం చారు. సిఐటియు నాయకులు అప్పన్న, ఆనంద్, ఈశ్వరరావు, రాంబాయి, సుశీల, భవాని, సుగుణ, సంధ్య, రాములమ్మ, శివాజీ, రామప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం : యుటిఎఫ్ కార్యాలయం వద్ద జెండా ఎగురవేస్తున్న నాయకులు డి.రాము

పూసపాటిరేగ : జెండా ఎగురవేస్తున్న సిఐటియు నాయకులు బి.సూర్యనారాయణ

గజపతినగరం : జెండా ఎగురవేస్తున్న సిఐటియు నాయకులు

నెల్లిమర్ల : సభలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు టివి రమణ

కొత్తవలస : ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

చీపురుపల్లి : కర్లాం పౌల్ట్రీ వద్ద జెండా జెండా ఎగురవేస్తున్న కార్మికులు

వేపాడ : జెండా ఎగురవేస్తున్న ఎస్ఐ సుదర్శన్

జెండా ఎగురవేస్తున్న విద్యుత్తుశాఖ ఎస్ఇ లక్ష్మణరావు

ఉద్యోగుల హక్కుల కోసం ఉద్యమం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మేడే స్ఫూర్తితో విద్యుత్ ఉద్యోగుల హక్కులు, సమస్యలపై పోరాడదామని అందుకు విద్యుత్ ఉద్యోగులు సిద్ధం కావాలని విద్యుత్ ఉద్యోగులు యూనియన్ ఎస్.లక్ష్మణరావు, ప్రసాదరావు, రాజేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం యూనియన్ కార్యాలయం లో జెండాను సీనియర్ నాయకులు ప్రసాదరావు ఆవిష్కరించారు. అనంతరం విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద విద్యుత్ శాఖ సూపరెండెంట్ ఇంజినీర్ మువ్వల లక్ష్మణరావు జెండాను ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ కేంద్రాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల పోరాట ఫలితంగా అనేక హక్కులు సాధించుకున్నారని, అదే స్ఫూర్తితో హక్కులు, పిఆర్‌సి వంటి సమస్యలపై పోరాడదామని అన్నారు. ఎస్ఇ లక్ష్మణరావు మాట్లాడుతూ హక్కులు కాపాడుకోవడం అందరి బాధ్యతన్నారు. తన పరిధిలో ఏసమస్యలున్నా వాటిని పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటానన్నారు. అదే విధంగా శాఖ పరంగా ప్రజలకు అందించే సేవల్లో ఉద్యోగులు ఇదే స్ఫూర్తితో పని చేయాలన్నారు.కార్యక్రమంలో రూరల్ ఇఇ సురేష్‌బాబు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

చింతలవలసలో ప్రజాదర్బార్

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని చింతలవలస గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించిన జనవాణి ప్రజాదర్బార్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పాల్గొని, గ్రామ ప్రజల నుండి నేరుగా అర్జీలు స్వీకరించారు. ప్రతి సమస్యను జాగ్రత్తగా విని, పరిష్కార చర్యలు తక్షణమే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర రావు, ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, ఎంపిడిఒ భవాని, ఎపిఎం శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షులు పల్లె భాస్కర్ రావు, జనసేన పార్టీ మండల కోఆర్డినేటర్ పైలా శంకర్, సీనియర్ నాయకులు పాలు శ్రీను, రామారావు, పతివాడ శ్రీనివాసరావు, పిన్నింటి రాజారావు, అట్టాడ ప్రమీల, దిండి రామారావు, తొత్తుడి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని ముంజేరు గ్రామంలో గురువారం ఉదయం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే లోకం మాధవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు నూతన పింఛన్లను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీ నాటికి పింఛన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మట్ట అయ్యప్ప రెడ్డి, పల్లంట్ల జగదీష్, పళ్ళ రాంబాబు, వందనాల రమణ, పిడుగు జోగారావు, పిడుగు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని చినగుడిపాల గ్రామంలో గురువారం ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ పరిశీలించారు. కూలీలతో మాట్లాడి, పనితగ్గ వేతనం, సకాలంలో బిల్లులు అందుతున్నాయా? అని ఆరాతీశారు. సమయవేళలు పాటించి, కొలతల ప్రకారం పనిచేస్తే కూలి గిట్టుబాటు అవుతుందని చెప్పారు. అనంతరం ఎస్‌డబ్ల్యుపిసి షెడ్‌ను

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి : బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. స్థానిక పొట్టిశ్రీరాములు మున్సిపల్ పాఠశాలలో గురువారం బిసి కార్పొరేషన్, ఇడబ్ల్యుఎస్ సహకారంతో ఏర్పాటుచేసిన కుట్టు శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి కోసం కుట్టు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

క్రీడల పట్ల ఆసక్తి చూపాలి

పిల్లలు, యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. మున్సిపల్ షటిల్ కోర్టులో కోచ్ అపర్ణబాబా నిర్వహిస్తున్న ఉచిత షటిల్ శిక్షణను ఎమ్మెల్యే ప్రారంభించారు.

ఉద్యాన క్షేత్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

స్థానిక ఐటిఐ కాలనీకి ఎదురుగా ఉన్న ఉద్యాన క్షేత్రాన్ని ఎమ్మెల్యే బేబినాయన సందర్శించారు. నర్సరీలో రైతులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అవసరమయ్యే అన్ని రకాల మొక్కలను అందుబాటులో ఉంచాలని ఉద్యాన అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పరంగా ఎటువంటి సహకారం అవసరమైనా అందిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షులు వాసిరెడ్డి సత్యనారాయణ ఉన్నారు.


శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబినాయన

రోడ్డు వేయాలని వినతి

తెర్లాం మండలంలో పెరుమాళి-సుందరాడ రోడ్డు నుంచి చుక్కవలసకు రోడ్డు వేయాలని ఆ గ్రామస్తులు ఎమ్మెల్యే బేబినాయనకు వినతిపత్రం అందించారు. చుక్కవలసకు రోడ్డు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

రైతులకు అండగా ఉంటాం : నాగార్జున

ప్రజాశక్తి - చీపురుపల్లి

గ్రామీణ ప్రాంత రైతులకు అన్ని విధాలా అండగా ఉంటామని డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. డిసిసిబి అధ్యక్షునిగా నాగార్జున నియామకం కావడంతో ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి వచ్చిన కూటమి నాయకులు, అధికారులుతో చీపురుపల్లిలోని ఆయన నివాసం కోలాహలంగా మారింది. అధికారులు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి నాగార్జునకు జ్ఞాపికలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతానని ఈ కార్యక్రమంలో జిల్లా కూటమి నాయకులు బూర్లే శ్రీధర్, కంది చంద్రశేఖర్, రౌతు కామునాయుడు, వెన్నె సన్యాసి నాయుడు, కుమరాపు రవికుమార్, కిమిడి అశోక్ బాబు, పల్లే భాస్కరరావు, కలిదిండి పాణి రాజు, మామిడి రాజశేఖర్, మనోహర్, జిల్లా డిసిసిబి ఎంప్లాయీస్ యూనియన్ సెక్రటరీ. బి అచ్యుత రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పి శ్రీనివాస్ రావు, వైస్ ప్రెసిడెంట్ యమ్ వేణు గోపాల్ రావు, ఎవి యన్ రాజు, జిబి రవి కిరణ్, స్టేట్ కౌన్సిల్, యువి రమణ స్టేట్ కౌన్సిల్ యమ్ రాజ్ కుమార్, యూత్ కౌన్సిల్ డిస్ట్రిక్ట్ కమిటీ మెంబెర్స్, నియోజవర్గ తూర్పు కాపు ఉద్యోగుల సంఘ ప్రతినిధులు మంత్రి రమణమూర్తి, గంగుపల్లి సత్యం, మీసాల అప్పలనాయుడు, మీసాల శ్రీను, రౌతు రాము, బూరి అనంత్, తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునను సత్కరిస్తున్న నెల్లిమర్ల ఎమ్మెల్యే నాగమాధవి

సిరిమానుకు పూజలు

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని పెంటశ్రీరాంపురం గ్రామంలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో జరిగే పైడితల్లమ్మ పండగ సిరిమానుకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు, టిడిపి మండల అధ్యక్షులు భాస్కర్‌నాయుడు, మాజీ సర్పంచ్ రొంగల రమణమ్మ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమములో తాటిపూడి ప్రాజెక్టు చైర్మన్ కళ్లెంపూడి జగన్నాథం, కరక నారాయణ, కరక మహేష్ పాల్గొన్నారు.

కార్మికుల సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని ఈవినింగ్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు జి.అప్పలసూరి అన్నారు. మేడే సందర్భంగా ఉడా కాలనీ పేస్-3 పార్క్ ఈవినింగ్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించి బట్టలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పార్కులను పరిశుభ్రపరుస్తూ, ఆహ్లాదకరంగా ఉంచడంలో మున్సిపల్ కార్మికుల శ్రమ ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవినింగ్ వాకర్స్ క్లబ్ కార్యదర్శి టి.చిన్నారావు, కోశాధికారి ఆదినారాయణ, మున్సిపల్ కార్మికుల కో-ఆర్డినేటర్ ఏసుదాసు, వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు ఎర్నాయుడు, గౌరవ అధ్యక్షుడు గౌరీ ప్రసాద్, గౌరవ సలహాదారులు టి.చిరంజీవి రావు తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ బూట్ క్యాంప్ ప్రారంభం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఎటిఎల్ సమ్మర్ బూట్ క్యాంపును గురువారం ఎంఇఒ బి.నర్సింగరావు, జిల్లా సైన్స్ అధికారి టి.రాజేష్, హెచ్ఎం బి.ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. ఇందులో 35 మంది పాఠశాల విద్యార్థులు, ఐదుగురు లెండి ఇంజినీరింగ్ కళాశాల ఇంటర్న్‌షిప్ విద్యార్థులు పాల్గొన్నారు. తొలి రోజు పేపర్ ట్రోనిక్స్ అనే పేపర్‌పై ఎలక్ట్రికల్ సర్క్యూట్‌ను డిజైన్ చేయడం, అందులో ప్రాథమిక అంశాలు, వివిధ ఉపకరణాల పనితీరును విద్యార్థులు నేర్చుకున్నారు. టింకర్ క్యాడ్ ద్వారా సి లాంగ్వేజ్‌లో కోడింగ్ రాస్తూ సర్క్యూట్‌ను డిజైన్ చేయడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైన్సు ఉపాధ్యాయులు బి.జయసుధ, సురేంద్రనాథ్, సిహెచ్ సరస్వతి, ఎ.వీరాస్వామి, రహీం పాల్గొన్నారు.

నేటి నుంచి శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

మెయిన్ రోడ్డు కాలువపై ఆక్రమణల తొలగింపు
267 అక్రమ కొళాయి కనెక్షన్లు తీసేస్తాం
నగర పంచాయతీ కమిషనర్ ఎ.తారక్ నాథ్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధిలో ఈ నెల 2 నుంచి శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎ.తారక్‌నాథ్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ పురపాలక శాఖ ఆదేశాల మేరకు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ప్రధాన రహదారిని ఆనుకుని కాలువపై ఉన్న ఆక్రమణలను తొలగిస్తామని చెప్పారు. నగరపంచాయతీలో ఉన్న 267 అక్రమ కుళాయి కనెక్షన్లను తొలగిస్తామని, అవసరమైన చోట కొత్త కుళాయి కనెక్షన్లు, వీధి లైట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. 2 వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ ప్రధాన కాలువుల్లో పూడికను స్థాయిలో తీయిస్తామని చెప్పారు. పారిశుధ్య సిబ్బంది ఉదయం 5.30 గంటలకే విధులకు హాజరు కావాలని సూచించారు. నగరపంచాయతీ సిబ్బంది ప్రతి కార్యక్రమానికి చేతివాటం చూపిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయని విలేకరులు ప్రశ్నించగా తన దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. నగరపంచాయతీలో ఇద్దరు పారిశుధ్య కార్మికులు చనిపోయారని, మరో ముగ్గురు ఉద్యోగ విరమణ చేశారని, మరో ఇద్దరు ఉద్యోగం మానేశారని చెప్పారు. కౌన్సిల్ ఆమోదంతో ఆ పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. చనిపోయిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పిస్తామని చెప్పారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ కట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్తు సరఫరాకు ఉదయం 7.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ డిఇఇ పి.త్రినాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉడా సబ్ స్టేషన్ పరిధిలోగల 11కెవి మహాలక్ష్మి నగర్ ఫీడర్, 11కెవి సాయిబాబా టెంపుల్ ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం చెట్టు కొమ్మలను తొలగించే క్రమంలో ఉడాకాలనీ ఫేజ్-2, ఫేజ్-3, ఫేజ్-4, బొబ్బాది పేట, మహాలక్ష్మి నగర్, గోకపేట, సూర్యనగర్, సాలిపేట జంక్షన్, ఆదిత్య నగర్, వివేకానంద కాలనీ, ఫిష్ మార్కెట్ ఏరియాలో విద్యుత్ నిలుపుదల చేస్తామని తెలిపారు.

నెల్లిమర్ల : సతివాడ, రామతీర్థం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో వ్యవసాయం కనెక్షన్ పనులు కొనసాగుతున్నందున శుక్రవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని డిఇఇ పి.త్రినాధరావు తెలిపారు. మధుపాడ, పినతరిమి,పెద తరిమి, బొప్పడాం, వల్లూరు, బొడ్డపేట, బుచ్చన్నపేట, ఒమ్మి, మాల్యాడ, వెంకన్నపాలెం, గ్రామాలకు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

బొబ్బిలి : బొబ్బిలి కోటి చెరువు సబ్ స్టేషన్ నుంచి టిటిడి ఫీడర్, చర్చి సెంటర్ ఫీడర్, జగన్నాథపురం ఫీడర్ నుంచి విద్యుత్తు సరఫరా అయ్యే ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఇఇ అనంతరావు చెప్పారు.

ఐసియు రోగికి పింఛను అందజేత

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఐసియులో చికిత్స పొందుతున్న రోగికి గ్రామ పంచాయతీ కార్యదర్శి పింఛన్ అందజేశారు. గురువారం కొండగుంపాం పంచాయతీ కార్యదర్శి లెంక తౌడు అదే గ్రామానికి చెందిన కలిశెట్టి నాగారత్నం జిల్లా కేంద్రంలో ఐసియులో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకుని పిహెచ్‌సి పింఛన్ సొమ్మును అందజేశారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు

ప్రజాశక్తి-వేపాడ

అక్రమంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ రాములమ్మ హెచ్చరించారు. అరిగిపాలెం గ్రామంలో అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నారని ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు ఆమె స్పందించారు. ఎంఆర్ఐ రామలక్ష్మి, విఆర్ఒ సత్యవతిని సంఘటనా స్థలానికి గురువారం పంపించారు. చెరువులో అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించామని ఆమె వివరించారు.

ఆటలపై శిక్షణ

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం క్రీడలపై శిక్షణ ఇచ్చారు. వేసవి వినోద శిక్షణ శిబిరంలో భాగంగా క్యారమ్స్, లూడో, చదరంగం ఆటలపై శిక్షణ ఇచ్చినట్లు గ్రంథాలయ అధికారి స్వర్ణకుమారి చెప్పారు. వేసవి సెలవుల్లో పిల్లలు, విద్యార్థులకు గ్రంథాలయంలో చదవడంతోపాటు ఆటలపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.